క్లుప్తంగా

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



పరుగుపందెంలో పాల్గొన్న టీచర్లు

కోట: ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. అందులో భాగంగా సోమవారం ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాల మైదానంలో ఉపాధ్యాయులకు వివిధ అంశాల్లో ఆటల పోటీలు జరిగాయి. ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు పోటీల్లో తమ సత్తా చాటారు. విజేతలకు మంగళవారం నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



టీహెచ్ఆర్‌ను అందజేస్తున్న సీడీపీఓ మహబూబీ

చిల్లకూరు: పౌష్టిహారం క్రమం తప్పకుండా తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ అన్నారు. మండలంలో జరుగుతున్న పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా చిల్లకూరు సెక్టార్ పరిధిలోని అన్నిఅంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి సోమవారం కడివేడు నేదురుమల్లి రాజ్యలక్ష్మీ కాలనీలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళ గర్భిణిగా, బాలింతగా ఉన్న సమయంలో బలవర్ధకమైన ఆహారం తీసుకువాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతికిరణ్మయి, సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి



కియోస్క్ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ

సైదాపురం: మండలంలో విస్తారంగా సాగు చేస్తున్న ఉద్యానవన పంటలను కూడా ఈ-క్రాప్ విధిగా నమోదు చేయాలని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని లింగసముద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుతో రైతులకు పలు ప్రయోజనాలుంటాయన్నారు. మండలంలోని నిమ్మ, మామిడి తోటలను కూడా ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉందన్నారు. సున్నా వడ్డీతో పాటు పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట ఉత్పత్తుల కొనుగోలుకు ఈ-క్రాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెబ్ ల్యాండ్, సీసీఆర్సీ డేటా ఆధారంగా ఈ-క్రాప్‌ను నమోదు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

నేడు నూతన భవనాల ప్రారంభం

కోట: పట్టణంలోని నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను మంగళవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ చక్రవర్తి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు.

ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుతో గుర్తింపు



ఎస్సీ గురుకులం ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు

కోట: ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుతో గుర్తింపు లభించిందని ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ అద్దూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన జిల్లా ఉత్తమ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుడిగా ఎంపిక య్యారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో మాట్లాడుతూ రెండేళ్లుగా ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు పదిలో వందశాతం ఫలితాల సాధన, పాఠశాల అభివృద్ధికి కృషి చేసినందుకు గుర్తింపు లభించిందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



తూమాయిలో అవగాహన కల్పిస్తున్న సౌజన్య

రాపూరు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దూరం అవుతుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సౌజన్య అన్నారు. రాపూరు మండలం తూమాయి, నవాబుపేట, ఇందిరా కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించి పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్షర కిరణాలు.. ఆ ఉపాధ్యాయులు

పాఠశాల అంటే వారికి ఇంటితో సమానం..బడిలో అడుగు పెట్టింది మొదలు వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తారు. బోధనకే పరిమితం కాకుండా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడానికి కృషి చేస్తారు. వారు విద్యాభివృద్ధికి చేస్తున్న విశేష కృషికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు దక్కాయి. వారు ఈ నెల 5వ తేదీన తిరుపతిలో జరగనున్న కార్యక్రమంలో అవార్డులు స్వీకరించనున్నారు.

- బోధనలో మార్పునకు కృషి
- విద్యార్థులతో మమేకం
- జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు ఎంపిక



విద్యార్థులతో మమేకమై బోధన చేస్తున్న హెచ్ఎం సరళకుమారి

బోధనలో సరళం

దక్కిలి: మండలంలోని కందలవారిపల్లె గిరిజనకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఉప్పలూరి సరళకుమారి 2017 నుంచి పనిచేస్తున్నారు. ఆమె 2002లో వైఎస్సార్ కడప జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. తరువాత అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా సరళకుమారి కమ్మపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో 2009 నుంచి 2017 వరకు పని చేశారు. అప్పట్లో ఆమె పాఠశాలలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించిన నర్రావుల ఫౌండేషన్ వారు ఆమెను ఘనంగా సన్మానించారు. తరువాత 2017లో బదిలీల్లో భాగంగా కందలవారిపల్లె గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయానికి ఎక్కువ మంది బడి బయట విద్యార్థులు ఉండడం గుర్తించారు. విద్యతోనే గిరిజన పిల్లల్లో మార్పు తీసురావాలన్న ఆశయంతో ఆమె ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, వారిలో మార్పు తీసుకొచ్చారు. దీంతో ఆ గిరిజన కాలనీలోని విద్యార్థులందరూ పాఠశాలలో చేరారు. ఆమె హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించే నాటికి 36 మంది ఉండగా నేడు 53 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఏటా గురుకులానికి విద్యార్థుల ఎంపిక

విద్యార్థులకు అంకితభావంతో బోధన చేసి, ఏటా గురుకులంలో ప్రవేశాలు పొందేందుకు కృషి చేస్తున్నారు. విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు ఆమె తన ఇంట్లో ఉచితంగా కోచింగ్‌తోపాటు, విద్యా సామగ్రి అందజేసి, వారు విద్యలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన మొదటి ఏడాది 10 మంది విద్యార్థులు గురుకులానికి ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఏటా ఐదుగురికి తగ్గకుండా గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందుతున్నారు.



నాడు-నేడు నూతన పాఠశాల భవనానికి నీరు పడుతున్న సరళకుమారి

అవార్డులివీ..

ఆమె విధి నిర్వహణలో చేస్తున్న కృషిని గుర్తించిన ఉన్నతాధికారులు ఆమెకు 2022లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి, అవార్డు అందజేశారు. ఈ ఏడాది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు సరళకుమారిని వరించింది.

బెత్తం పట్టని టీచర్



తరగతి గదిలో శ్రీరాములు

పెళ్లకూరు: తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన జీలుగ శ్రీరాములు చదువుపై మక్కువతో క్రమశిక్షణతో చదువుకుని 1996లో దొరవారిసత్రం మండలం, తుంగమడుగు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాడు. 2000లో పెళ్లకూరు మండలం యడపూడి, 2005లో చిల్లకూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేశాడు. 2009లో పదోన్నతిపై చెంబేడు జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరాడు. అనంతరం 2018లో బదిలీపై నెలబల్లి జెడ్పీ హైస్కూలులో గణిత ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. ఆయన తన 27 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో బెత్తం పట్టి, పిల్లలను కొట్టిన దాఖలాలు లేవనడంలో ఏమాత్రం సందేహం లేదు. 14 ఏళ్లుగా ఏటా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తన జీతం నుంచి రూ.50 వేలు నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తున్నారు.

సత్వర పరిష్కారం చూపండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఆర్డీఓకు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గూడూరు టిడ్కో అపార్ట్‌మెంట్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని ఆ ఇళ్లలో లబ్ధిదారులు విన్నవించారు. గూడూరులో శిథిలావస్థలో ఉన్న అంబేడ్కర్ భవన్‌ను పునర్నిర్మించాలని బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు.

అర్హులందరికీ పింఛన్లు



పెళ్లకూరు: పునబాకలో కొత్త పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే పింఛన్ మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పునబాక సచివాలయంలో కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ నగదుతోపాటు ధ్రువపత్రాన్ని లబ్ధిదారుడు రామిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ రఘునాయుడు, నాయకులు కృష్ణయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలంంలోని 11 సచివాలయాల పరిధిలో 91 మందికి కొత్త పింఛన్లు సోమవారం అందజేసినట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. 4,897 మంది పింఛన్లకుగాను ఇప్పటి వరకు 4,822 మందికి పింఛన్ అందజేసి 98.47శాతం సాధించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీసీఓ జయభారతి

దక్కిలి: గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల తిరుపతి-చిత్తూరు జిల్లాల డీసీఓ (జిల్లా కోఆర్డినేటర్) జయభారతి తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాల, కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి-చిత్తూరు జిల్లాల్లోని గరుకులాల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. గురుకులం ప్రిన్సిపల్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

దొరవారిసత్రం: మండలం స్థాయిలో 2023-24 ఏడాది గాను ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపికయ్యారని ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. తొగరాముడి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్ రామ్మోహన్‌రావు, సిద్దాపురం ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన కే శ్రీనివాసరావు, తల్లంపాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన వీ శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారని చెప్పారు. వీరిని సన్మానిస్తున్నట్లు తెలిపారు.


దక్కిలిలో ఆరుగురు

దక్కిలి: మండల స్థాయి ఉత్తమ అవార్డులకు ఆరుగురిని ఎంపిక చేసినట్లు ఎంఈఓ కే వెంకటేశ్వర్లు తెలిపారు. దగ్గవోలు హైస్కూల్‌లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఎం రమణయ్య, చాపలపల్లె దళితవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ సుధాకర్, మహసముద్రం ప్రాథమిక పాఠశాల టీచర్ పీ బాలసుబ్రమణ్యం, నాయుడుపాళెం ప్రాథమిక పాఠశాల ఎస్ జయచంద్ర, వెంకటేశ్వరపురం ప్రాథమిక పాఠశాల పీ తేజోవర్మ, దగ్గవోలు ఈస్ట్ ప్రాథమిక పాఠశాల బీ గౌతమ్ ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఉత్తమ సేవలు అందిస్తున్న 11మంది టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు సోమవారం ఎంఈఓ సుబ్రమణ్యం తెలిపారు. ఏ హరి (పెన్నేపల్లి), ఏ రామకృష్ణమురళి(తాళ్వాయిపాడు), వి శంకరయ్య(జంగాలపల్లి), సీహెచ్ మంజువాణి(ముమ్మారెడ్డిగుంట), గుమ్మా భాస్కర్(పెరుమాళ్లపల్లి) కే విజయసాయిలు (పునబాక), సీహెచ్ శశికళ(కొత్తూరు), జే డోరతివయోలా(కానూరురాజుపాళెం) ఆర్ రవిచంద్ర(భీమవరం), యం శివప్రసాద్(పెళ్లకూరు), ఎన్ రత్నమ్మ (నెలబల్లి) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని చెప్పారు.

క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని హెచ్‌డీ ఎరీనా షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి షటిల్ క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడలో రాణించాలని కోరారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సీ విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైజీఎస్బీఏ 12 ఏళ్లుగా షటిల్ క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. ప్రతి ఏడాది గూడూరు పట్టణంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తూ షటిల్ క్రీడాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్లొమా ఇంజినీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, వైజీఎస్బీఏ అధ్యక్షుడు షేక్ జమాలుల్లా, మహేంద్ర ఎలైట్ అధినేత కే రామారావు, ఐ శ్రీహరి, ఎస్ చెంచురామయ్య, ఎస్‌పీఎస్‌బీసీ అధ్యక్షుడు టీ సురేష్, గిరిబాబు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాపూరు: మండలంలోని పెనుబర్తి సచివాలయం పరిధిలో మంగళవారం నాగవారిపల్లి, పెనుబర్తి గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి , ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొంటారన్నారు

సీపీఎం ఆందోళన

గూడూరురూరల్: ప్రధాని నరేంద్రమోదీ ప్రజలను మోసం చేశారని సీపీఎం తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడు పుల్లయ్య పేర్కొన్నారు. పెరిగిన ధరలు తగ్గించాలని కోరుతూ సోమవారం గూడూరు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడు పుల్లయ్య, సీపీఎం నాయకులు జోగి శివకుమార్, రాజగోపాల్, బి.వి. రమణయ్య, శంకరయ్య, శ్రీనివాసులు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మండల సమాఖ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళి

తడ: మండల సమాఖ్య అభివృద్ధి పథంలో నడుస్తుందని ఏరియా కోఆర్డినేటర్ మురళి అన్నారు. మండల సమాఖ్య వార్షిక మహాసభ సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ మండల సమాఖ్య ఆదాయ మార్గంలో నడుస్తుందని, ఇంకా ఆదాయ మార్గాలను అన్వేషించాలని తెలిపారు. 2019 నుంచి ఇచ్చిన రుణాలన్నీ వంద శాతం రికవరీతో నడుస్తున్నాయని చెప్పారు. అనంతరం సమాఖ్య ఎన్నికలు నిర్వహించారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా సుగుణ, నాగమణి, కోశాధికారిగా కౌసల్య ఎన్నికయ్యారు. తరువాత ఉత్తమ సేవలు అందించిన వారికి సమావేశంలో బహుమతులు అందజేశారు. మాజీ అధ్యక్షురాలు అంజలమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారెడ్డి, సీసీలు జనార్దన్, వెంకటేశ్వర్లు, అరుణ, సలోమి పాల్గొన్నారు.


అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నాయుడుపేట: అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ రూత్ రమోల్ తెలిపారు. స్థానిక బాలికల వసతి గృహంలో అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థిని బీ షర్మిల 600 మీటర్లు పరుగు పందెంలో రెండో స్థానం సాధించినందుకు జ్ఞాపిక, సర్టిఫికెట్, రూ.2వేలు నగదు బహుమతి అందించారన్నారు. అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థిని బీ షర్మిల 300 మీటర్లు పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచినందుకు జ్ఞాపిక, సర్టిఫికెట్, రూ.వెయ్యి నగదు బహుమతిని అందించారన్నారు. అనంతరం అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.


నేడు శివపార్వతుల శాంతి కల్యాణం



ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరిన శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రచార రథం

చిల్లకూరు: మండలంలోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం శ్రీకాళహస్తీలోని జ్ఞాన ప్రసూనాంబ శ్రీకాళహస్తీశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సీ ఇంద్రసేనమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ధర్మప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రచారరథం తూర్పుకనుపూరు గ్రామానికి చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరగనున్న కల్యాణ వేడుకలను భక్తులు కనులారా వీక్షించి తరించాలని ఆమె కోరారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న కళ్యాణ రథాని స్వాగతం పలికారు. ఆమె వెంట ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

విజయ సాధనపై వర్క్‌షాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

గూడూరురూరల్: పోటీ పరీక్షల్లో విజయం సాధించడంపై సోమవారం గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. పోటీ పరీక్షల్లో రాణించడం ఎలా, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో తీసుకోవాల్సిన మెళకులపై కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె.కృష్ణప్రసాద్, నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల అధ్యాపకులు డాక్టర్ తోటకూర రాంబాబు, రాపూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు జె.స్వరూప విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, డాక్టర్ కె.శివప్రసాద్, శైలజ, ఝాన్సీవాణి, శ్రీధర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని ఇరకం కుప్పంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బీవాపాళెం పడవల రేవు నుంచి పడవపై ఇరకం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కిలివేటికి, నాయకులకు జాలర్ల నాయకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. తొలుత ఎమ్మెల్యే ఆ గ్రామంలోని నెల్లూరమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఇరకం దీవిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఆయనకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి ఇబ్బందినీ పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులతో మాట్లాడి, వారికి బుక్‌లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, తహసీల్దార్ జయజయరావు, ఎంపీడీఓ ఆమోసుబాబు, సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కే రఘురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మణి, నదియ, తడ సర్పంచ్ ఆర్ముగం, నాయకులు వాసుమొదలి, రత్నం, తదితరులు పాల్గొన్నారు.